# చెకుముకి నిప్పు

"పునరపి జననం, పునరపి మరణం" అంటుంది శంకర భగవత్పా దులవారి 'భజగోవింద శ్లోకం'

"జాతస్యహి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మమృతస్య చ" అంటుంది భగవద్గీత.

అయితే, ఇవన్నీ తెలీకేనా అలనాడు రాముడు సీత కనిపించకపోతే చెట్టుకీ, పిట్టకీ చెప్పుకొని బావురుమన్నాడు!

ఇవన్నీ తెలీకేనా సతీదేవి అగ్నిలో ఆహుతైనపుడు శివుడు విలయతాండవం చేసేడు!

మరింక మానవమాత్రుడినైన నేను ఏపాటివాణ్ణి!

ఆనందరావు పోయేడన్న వార్త విన్ననేను రాముడిలా భోరుమనలేదు. శివుడిలా తాండవం చెయ్యలేదు.

మరైతే ఏం చేసేవయ్యా అంటారేమో?

ఏమీ చెయ్యలేదు. శిలలా ఉండిపోయేను.

ఒక ఎత్తయిన శిఖరం మీద నుంచి కాలు జారిలోయలో పడిపోతే ఏమనిపిస్తుంది? ఏమీ అనిపించదు. అంతా శూన్యం. అంతే.

శరీరం, మనసు మొద్దుబారిపోయేయి. అంతలో నెమ్మదిగా సర్దుకున్నాను. అతని పరంగా ఆలోచిస్తే అదృష్టవంతుడు అనిపించింది.

ఒంటరి బతుకు నుంచి విముక్తి దొరికింది.

అతని భార్య పోయి అయిదేళ్ళయింది. ఈ అయిదేళ్ళ నుంచి అతను ఒంటరివాడే. ఉండడానికైతే ముగ్గురు కొడుకులున్నారు. ఇద్దరు కూతుళ్ళున్నారు. ఏ కోడలూ 'అన్నం తింటారా మావగారూ' అని అడిగిన పాపాన పోలేదు.

కూతుళ్ళిద్దరూ తల్లి బంగారం కోసం తన్నుకున్నారే తప్ప 'కాఫీ తాగుతావా నాన్నా' అనలేదు ఏనాడూ.

"సత్రం భోజనం, మఠం నిద్రలా ఉంది నా బతుకు" అని బాధపడేవాడు.

"అయినా, ఈ ఆడవాళ్ళు ఎప్పుడూ పునిస్త్రీగా పోవాలనే గోలపెట్టేస్తారు. వీళ్ళకసలు బుద్ధుందా? కట్టుకున్న మొగాడేవైఁపోవాలి? వీళ్ళ పసుపు, కుంకం కోసం మొగుడు బలైపోవాలా? కావాలంటే పసుపు, కుంకం కడవల్తో పెట్టుకోమను. అసలు ఆడది పుట్టిన దగ్గర్నుండి ఎడ్జస్ట్ అవటం నేర్చుకుంటుంది. అంచేత మొగుడు పోయినా ఎక్కడో ఓ చోట ఎడ్జస్ట్ అయిపోతుంది. మొగవెధవున్నాడు చూసేవూ ఎక్కడా, ఎప్పుడూ ఎడ్జస్ట్ అవడు, అవలేడు. మరంచేత మొగాడే ముందు పోవాలి" అనేవాడు.

అయితే, ఆవిడ పుణ్యాత్మురాలు. ముందుపోయింది. అప్పటినుంచి ఒంటరి పక్షి అయిపోయేడు.

ఇంతకీ ఇందులో తప్పు నాకేం కనిపించలేదు. తప్పంతా ఆనందరావుదే.

సాధారణంగా స్టూడెంట్‌గా ఉన్న రోజుల్లో అందరూ కమ్యూనిస్టు కబుర్లు చెప్తారు. అయితే, నిజ జీవితంలో వాటిని పాటించేవాళ్ళు చాలా అరుదు. ఆ అరుదైన వాళ్ళలో ఆనందరావు ఒకడు.

"మనిషి వంక మాల్లక్ష్మి తీరుస్తుందని డబ్బున్న ఆడపిల్లని ఏ వెధవైనా చేసుకుంటాడు. మనిషికి కావల్సింది, ఉండాల్సింది డబ్బు కాదు మంచితనం, మానవత్వం. అవి లేనప్పుడు ఎంత డబ్బున్నా ఒకటే" అని కొడుకులందరికీ అణా అర్జన, అర్థణా ఆస్తి లేని కుటుంబాల్లో పిల్లల్ని ఏరి కోరి చేసేడు.

మంచితనం ఉండాల్సిందే. కానీ, మోతాదు మించిన మంచితనం మంచిది కాదు.

"ట్రూత్ ఈజ్ రేర్, సో ఎకనమైజ్ ఇట్" అన్నాడు మార్క్‌ట్వైన్. మంచితనానికి కూడా అదే వర్తిస్తుంది.

ప్రిన్సిపల్స్ వినడానికీ, చదువుకోవడానికీ ఇంపుగానే ఉంటాయి. అనుభవంలోకి వచ్చేసరికి చావుదెబ్బకొడతాయి. అంచేత వాటిని

పాటించే వాళ్ళకి ఆ చావుదెబ్బకి తట్టుకునే ధైర్యం కూడా ఉండాలి.

ఆనందరావుకి ఆ ధైర్యం ఉంది.

ఆనందరావు పోయిన వార్త వినగానే వాళ్ళింటికి పరిగెత్తేను. వాకిట్లో పెద్ద షామియానా వేసి ఉంది. కుర్చీలు కూడా వేసేరు. వాకిలి నిండా జనంవే. ఆనందరావు రెండో కొడుకు డిఎస్పీ. అంచేత పోలీసులే ఎక్కువున్నారు. నేను తిన్నగా లోపలికెళ్ళేను. హాల్లో–భీష్ముడు అంపశయ్య మీద పడుకున్నట్లు ఆనందరావుని ఐస్‌దిమ్మలమీద పడుకోబెట్టేరు. గదంతా నీటిమయం. ఇద్దరు, ముగ్గురు పోలీసులు మాత్రం ఆ నీరంతా గోనెల్తో తుడుస్తున్నారు.

ఆనందరావు తల దగ్గర ఓ స్టూలు మీద ప్రమిద, దాంట్లో ఆరిపోయిన వత్తి ఉన్నాయి. నూనె లేదు. దీపం ఆరిపోయిందనడానికి సింబాలిజంలా ఉంది.

సాధారణంగా ఎవరైనా పోతే వాళ్ళ పక్కన దగ్గర వాళ్ళో, పిల్లలో ఎవరో ఒకరు కూర్చుంటారు. బోరున ఏడవక్కర్లేదు. కానీ, ఆనందరావు శరీరం పక్క ఎవరూ లేరు.

అయితే, ఆశ్చర్యం! అతని శరీరం పక్క అతనే కూర్చున్నాడు. బహుశా అదేనేమో ఆత్మ అంటే. నాకే ఎందుక్కనిపించేదూ అన్నదానికి సమాధానం లేదు. పైగా, నన్ను చూసి బోరుమన్నాడు. అతను బతికున్నంత కాలం ఏ ఒక్కనాడూ కళ్ళనీళ్ళు పెట్టుకోలేదు. ఆఖరికి భార్య పోయినప్పుడు కూడా వేదాంతిలా నిర్వికారంగా ఉన్నాడే తప్ప ఏడవలేదు.

మరిప్పుడీ ఏడుపేంవిటి?

గుండె ఆగిపోయింది. కాబట్టి, గుండెధైర్యం కూడా పోయిందా?

చెప్పొద్దూ, నాకూ ఏడుపొచ్చింది.

ఇంతలో ఓ పదిమంది పోలీసులు మిడుతల దండులా రయ్యిమని వచ్చి తలో పువ్వుల దండా ఆనందరావు మీద పడేసి అంత స్పీడుగానూ వెళ్ళిపోయేరు.

“చచ్చిపోయేంవని బాధపడుతున్నావా” అన్నాను. మరోసారి బోరు మన్నాడు.

"చచ్చిపోతే బాధెందుకు? నిన్ననగా పోయేను. ఇంతవరకు అతీ లేదు, గతీ లేదు. అసలే చావుతో చల్లబడిపోయేను. ఇప్పాడీ ఐస్‌దిమ్మల్తో కర్ర అయిపోయేను. పైగా, ఈ పువ్వుల దండలు చూడు. పువ్వుల్లో ఉన్న పురుగులన్నీ నా మీద విహారం చేసేస్తున్నాయి. ఒళ్ళంతా పురుగులే. పురుగులు పడి చస్తావంటే ఇదేనన్నమాట."

నా గుండెను ఎవరో పిడిచేస్తున్నట్లయింది.

"ఏదో పోన్లెస్దూ, అదొక ఆచారం, అంతే" అన్నాను ఏవఁనాలో తోచక.

"అయినా, ఇదేం దండల కల్చర్రా బాబూ. పెళ్ళికీ దండలే. చావుకీ దండలే. సన్మానానికి దండలే. మన పెళ్ళికి పువ్వుల దండ లెక్కడివిరా? కర్పూరపు దండలు వేసేవారు. ఈ పువ్వుల దండలు మనం ఎరువు తెచ్చుకున్న కల్చర్రా బాబూ. ఈ పోలీసుల సొమ్మేం పోయింది? పావలా ఇచ్చి పెళ్ళానిక్కూడా పువ్వులు కొనని జాతి. తేరగా వస్తాయి. మెహర్బానీకి వేసేస్తున్నారు."

లాభంలేదు. వీడిచేత ముందీ ఏడుపు మానిపించాలి.

"చచ్చిపోయేవు కదా. ఇంకా నీకీ శరీరం మీద మమకారం పోలేదా?" ఆశ్చర్యపోయేను.

అంత ఏడుపులోనూ ముందుటెండ మధ్య చిన్న చిరు మెరుపులా ఓ చిరునవ్వు నవ్వేడు. "మమకారం పోవడానికి దహనం చేసేస్తారు. శరీరం బూడిదైపోగానే పంచప్రాణాలూ విడిపోతాయట. ఒకటి ప్రాణం పోయిన చోట, ఒకటి దహనం చేసిన చోట, ఒకటి కర్మ చేసేవాడిలోను...మిగతా రెండూ ఎక్కడో ఉంటాయని మా తాత చెప్పేవారు. ఆ రెండూ ఎక్కడుంటాయో అదే తెలుస్తుంది. పదిరోజుల కర్మ పూర్తి అయేక అవన్నీ పంచభూతాల్లోనూ కలిసిపోతాయట. కానీ, మరి నాకు దహనం లేదు, కర్మ లేదు. అన్ని ప్రాణాలూ ఇక్కడే కొట్టుకుంటున్నాయి. బాబ్బాబు, వేగం ఆ ఏర్పాట్లు చూడు" అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ.

బావుంది. చచ్చిపోయిన తరవాత కూడా సుఖం లేదన్నమాట.

"పైగా, నిన్నటి పువ్వులన్నీ నీళ్ళలో నాని ఒకటే కుళ్ళు కంపు. ఆ కంపు శరీరందే అనుకుంటున్నారు. ఏం దారి?" జాలిగా చూసేడు.

అతని మాట పూర్తి కాకుండానే నేను వీధిలోకి వెళ్ళి ఒక పోలీసుని

పిల్చేను. అతనికి డబ్బిచ్చి సంపంగి అత్తరు తెమ్మన్నాను. అతను నావేపు వింతగా చూసి, "అది దొరక్కపోతే మరేదైనా తెమ్మంటారా" అన్నాడు. ఊరంతా గాలించైనా సరే అదే తెమ్మన్నాను.

ఇంక అక్కడ నిలబడకుండా సరాసరి లోపలికి వెళ్ళేను. పెద్ద అల్లుడు గదిలో ఓ మూల చాపమీద కూర్చుని నాలుగేళ్ళ కొడుకు చేత హూంవర్కు చేయిస్తున్నాడు.

"రండి అంకుల్ రండి. నాన్న చూసేరా ఎంత పని చేసేరో" అంది చిన్న కూతురు కళ్ళు తుడుచుకుంటూ.

ఈ పిల్ల ఎమ్మెస్సీ చదివింది. పై చదువుకి ఫారిన్ వెళ్తానంటుంది. మనదేశం చదువు ఆ అమ్మాయికి చాలనట్లు. పెళ్ళి చేసి పంపిస్తానంటాడు ఆనందరావు. పెళ్ళైతే ఆ వచ్చేవాడు ఒప్పుకోడేమోనని ఈ పిల్ల భయం.

"ఇప్పుడీ ఫారిన్ వ్యాధి ఏఁవిట్రా. ఇంత అంటువ్యాధి అయిపోయింది. కలరా లాంటి అంటువ్యాధులక్కూడా వేక్సినేషన్ కనిపెట్టారు. కానీ, ఈ అంటువ్యాధికి మందులేదు. ఇప్పుడు మనదేశం అంతా ఈ వ్యాధితో కుళ్ళిపోతోంది. పూర్వం కనీసం చదువుకున్న వాళ్ళలో కొంతమంది మాత్రమే వెళ్ళేవారు. ఇప్పుడీ గల్ఫ్ వగైరాలకి ఇంజనీర్లతో పాటు ఇటికలు మోసేవాడు కూడా వెళ్ళిపోతున్నాడు. వంటవాళ్ళు, తాపీవాళ్లు, మేష్టర్లు- ఒకరేఁవిటి-అందరూ వెళ్ళిపోతున్నారు. ఆరేళ్ళ గుంటడు కూడా అమెరికా కబుర్లే. పక్కింట్లో ఎంత పెరుగు అన్నం తిన్నా మనింట్లో చారు అన్నం సాటి వస్తుందా! ఛ! ఛ!! ఇంక మనం బాగుపడం" అని ఆనందరావు తరచు బాధపడేవాడు.

అలాంటివాడి కూతురా ఈ పిల్ల!

"అదృష్టవంతుడు. వచ్చిన పనైపోయింది. వెళ్ళిపోయేడు" అన్నాను, ఏదో ఒకటి అనాలి కాబట్టి.

"ఏఁవదృష్టమోలెండి" అని నాతో అని, "మీరా గదిలో హూంవర్కు చేసుకోండి" అని ఆ హూంవర్కుగాళ్ళని పంపించేసి, "గమ్మత్తు చూసేరా? రేపు వాడికి లెక్కలు టెస్ట్. ఇటు చూస్తే నాన్న అకస్మాత్తుగా పోయేరు. అటు పెద్దన్నయ్యకి టికెట్ దొరకలేదుట. రేపుగాని రాలేడు" అంది నాతో మూడు నిలువులు నిట్టూరుస్తూ.

ఇందులో గమ్మత్తేఁవిటో నాకర్థం కాలేదు.

పుట్టిన ప్రతి మనిషి పోక తప్పదు. మనం పుట్టినప్పుడే మన వెనుక చావు ఉంటుంది. అంచేత తండ్రి పోవడంలో గమ్మత్తేం లేదు.

ముందు గదిలో తండ్రి శవాన్ని పెట్టుకొని ఈ గుంటడి చేత హూంవర్క్ చేయిస్తున్నారే! అదీ గమ్మత్తు. యు.కే.జీలో వాడీ టెస్ట్ రాయకపోతే రేపు వాడికి ఐ.ఏ.ఎస్. మిస్సవుతుందా!

అసలా గుంటడి మొహం చూస్తే నాకే బావురుమనాలనిపించింది. మా చిన్నప్పుడు ఎవరింట్లోనైనా చావుగాని, పెళ్ళిగాని అయితే, పిల్లలకి చాలా సందడిగా ఉండేది. అప్పుడు పిల్లల గురించి ఎవరూ పట్టించుకోరు. అంచేత వాళ్ళదే రాజ్యం. పెళ్ళి అయితే మూడు నాలుగు రోజులే సందడి.

చావైతే మైలకదా. అంచేత పదకొండు రోజులు స్కూలుకి పంపేవారు కాదు. ఒకటే సందడి. అంచేత పిల్లలెప్పుడూ చావే ప్రిఫర్ చేసేవారు.

"మా ఇంట్లో ఎప్పుడూ ఎవ్వరూ చచ్చిపోరేం" అని కొంతమంది పిల్లలు బాధపడేవారు కూడా.

"మరిప్పుడు చావైనా, పెళ్ళైనా పిల్లల దినచర్యలో మార్పేం లేదు. మొన్న మరో గమ్మత్తు, చూసేను.

ఒకావిడ పెళ్ళికి వెళ్తూ బస్‌లో ఆరేళ్ళ పిల్లచేత చదివిస్తోంది.

ఉయ్ మస్ట్ పిటీ ది యంగర్ జెనరేషన్.

ఈ తల్లితండ్రుల్ని మాత్రం కమ్చీతో కొట్టాలి. తండ్రి పోతే టికెట్ రిజర్వేషన్ కోసం కూర్చున్నాడే పెద్దకొడుకు. అదీ సూపర్ గమ్మత్తు.

టాక్సీలో వచ్చేపాటి దూరంలోనే ఉన్నాడు.

ఒక బేచ్ భోజనాలు చేస్తున్నారు. సినీమా కబుర్లు, టీవీ కబుర్లు, భోజనం మానమని ఎవరూ అనరు. కానీ, తండ్రి గురించి ఒక్కమాట – ఒక్క మంచి జ్ఞాపకం – ఏదీ లేదు. వీధి గదిలో ఆనందరావు శరీరం గనక లేకపోతే పెళ్ళివారిల్లులా ఉంది.

"ఏఁవిటో అంకుల్ అన్నీ ప్రాబ్లమ్స్. బుర్ర పిచ్చెక్కిపోతోంది" అంది మళ్ళీ చిన్న కూతురే.

ఏఁవిటని అడగలేదు నేను.

"మీకు తెలుసుకదా – నాన్నగారికి నన్ను ఫారిన్‌లో చదివించాలని

ఎంత కోరికో! నాకు యు.కెలో సీటు వచ్చిందని నాన్న ఎంత పొంగిపోయారో. ఏం లాభం? టికెట్టు రేపటికి రిజర్వు అయిపోయింది కూడా. ఇప్పుడు ఇలా నాన్న చెప్పాపెట్టకుండా వెళ్ళిపోయేరు. రేపు వెళ్ళకపోతే సీటు పోతుంది. మరి పరిస్థితి చూస్తే..."

అప్పుడే అక్కడికి వచ్చిన పెద్దకూతురు మధ్యలోనే అందుకుంది. "ఏఁవిటి బాబాయిగారూ దీని పిచ్చి. నాన్న లేకపోవడం బాధే. కానీ, ఇప్పుడిది వెళ్ళకపోతే ఆయన ఆత్మ ఎంత బాధపడుతుంది? మేమంతా లేముటే. నాన్న సవ్యంగానే వెళ్ళిపోతారు. నువ్వు నీ ప్రయాణం ఏర్పాట్లు చూసుకో. ఏం చేస్తాం? జీవితంలో ఒక్కోసారి సుఖం, దుఃఖం కలిసే వస్తాయి – ఎండ, వాన కలిసి వచ్చినట్టు."

దీన్ని ప్రాక్టికల్ ఔట్‌లుక్ అనాలో, స్వార్థం అనాలో నాకు అర్థం కాలేదు.

కన్నతండ్రి పోవడాన్ని అంత క్యాజువల్‌గా తీసుకోవడం నాక్కొంచెం బాధగానే అనిపించింది. ఈ మమకారాలూ, అభిమానాలూ ఔటాఫ్ ఫాషన్ అయిపోతున్నాయేమో!

ఏమో ఏఁవిటి? అయిపోయేయి.

బాధపడడం కూడా చాదస్తం అంటారు.

ఈ వాతావరణంలో ఇమడడం నాకు కష్టంగానే ఉంది. ఇంక వెళ్దామనుకునేటంతలో...

అదిగో సరిగ్గా అప్పుడే వచ్చేడు ఓ డెబ్భై ఏళ్ళ ముసలాయన.

మెడలో రుద్రాక్షమాల.

నుదుట విబూది.

ఒక చేతికి రాగి కడియం.

మరో చేతిలో చిన్న సంచీ.

నెత్తిమీద నాలుగే వెంట్రుకలు.

చూడ్డానికి అప్పుడే తపస్సు ముగించుకొని వచ్చిన మునీశ్వరుడిలా ఉన్నాడు.

ఎవరో వెనుక నుంచి తరుముకొస్తున్నట్లు అదరా బాదరాగా వచ్చేడు.

అతన్ని చూడగానే ఆనందరావు చిన్న కూతురు "చూసేవా

మాఁవయ్యా. నాన్న ఎంత పని చేసేరో" అంటూ బావురుమంది.

అతను ఆ అమ్మాయి తల నిమురుతూ—

"మంచి పనే చేసేడు లేవే. అదృష్టవంతుడు. బతికినన్నాళ్ళు బ్రహ్మాండంగా బతికేడు. నేనసలు అందుతానో అందనో అని "ఊఁహూఁ" ఇదైపోయేను. మీరంతా చిన్నపిల్లలేం కారనుకో. అయితే, మీకు శాస్త్రం ఏం తెలిసి ఛస్తుంది? సరిగ్గా చెయ్యకపోతే అతగాడి ఆత్మ ఎంత క్షోభిస్తుంది" అన్నాడు కుర్చీలో కూలబడుతూ.

నా గుండె గతుక్కుమంది. ఈ ముసలాయన ఏం పితలాటకం పెడతాడో?

పెట్టనే పెట్టేడు.

"ఔనే అమ్మడూ. కర్మ చేయించే బ్రాహ్మడికి కబురు పెట్టేరా? మీ నాన్న యజ్ఞం చేసేడు కదా. మరి చాలా తంతు ఉంటుంది. ఔనూ, పెద్దాడు రాలేదా" అన్నాడు ఇల్లంతా కలయజూస్తూ.

"రేపొస్తాడు మాఁవయ్యా. టికెట్ దొరకలేదట." సంజాయిషీ ఇచ్చేడు మూడో కొడుకు.

అతనోసారి అందర్నీ ఎగాదిగా చూసి "మీకసలు బుద్ధులున్నాయిరా. కన్నతండ్రి పోతే రెక్కలు కట్టుకొని ఎగిరి రావలసింది పోయి, టికెట్టు కోసం చూస్తార్రా ఏఁవనుకుంటున్నార్రా అసలు? కబురు తెలిసిన నేను లారీ పట్టుకొని రాలేదూ? ఏం? ఓ టాక్సీ కట్టించుకొని రాలేడేఁవిట్రా మీ అన్న? చచ్చిపోయిన తండ్రి ఎక్కడికి పోతాడులే అనుకున్నాడా? కర్మకి ఎలాగు ఖర్చవుతుంది కదా, మళ్ళీ ఈ ఖర్చు దండుగ అనుకున్నాడా? మీ నాన్న గనక ఇలాంటి దిక్కుమాలిన లెక్కలు కట్టి ఉంటే మీరిలా ఉండేవారు కాదు. అలాంటివాడి కడుపున ఎలా పుట్టేర్రా ఇలాటి అప్రాచ్యపు కొడుకులు!

డబ్బు కాదురా దండుగ!

మీ బతుకులే దండుగ బతుకులు.

ఇలాంటి దరిద్రాలు చూడకుండా వెళ్ళిపోయిన మీ అమ్మ చాలా అదృష్టవంతురాలు. సరే...ఎలాగో తగలడండి" అంటూ కడిగేసేడు.

అమ్మయ్య!

ఇంతసేపటికి ఆ ఇంట్లో మనిషన్నవాడొకడు కనిపించేడు అని నాక్కాస్త సంతోషం కలిగింది.

అయితే, ఆ ఆనందం క్షణికం అని వెంటనే తేలిపోయింది మరుక్షణంలోనే.

ఆ సంతోషం అర్ధక్షణం మాత్రమే.

రెండో అర్ధక్షణంలో "ఒరే అబ్బాయ్! ఆ కర్మ చేయించేవాడిని నా దగ్గరకోసారి తీసుకురా. ఆఁ, ఈ ముసలాడేదో చాదస్తంగా చెప్తాడులే అని అతితెలివి ప్రదర్శించకు. మీ జీవితంలో మీ నాన్నకి చేసే మొదటిది, ఆఖరిదీ ఇదే.

ఆ చేసేదేదో శాస్త్రోక్తంగా చేసి మీ నాన్న రుణం తీర్చుకోండి. మీ నాన్న చితికి అగ్గిపుల్లతో నిప్పుచేసి పెట్టకూడదు. చెకుముకిరాళ్ళు రాపాడించి ఆ నిప్పుతో పెట్టాలి" అన్నాడు అతనే.

నా గుండెలో చితి పెట్టినట్లైంది.

ఈ చెకుముకి ఉపద్రవం ఏవిఁటి?

ఆనందరావు, నేను ఆరో ఏట నుంచి ఈనాటి వరకు క్లోజ్ ఫ్రెండ్స్మి.

ఈ యజ్ఞం సంగతి నాకు తెలీదే.

ఈ కొత్త విషయాన్ని అందరూ శ్రద్ధగా వింటున్నారు. ఇతను ఏం కొంప ముంచుతాడో!

"ఆఁ, ఈ రోజుల్లో ఇంకా శాస్త్రాలెవరు పాటిస్తున్నారోలెండి? ఏదో వదులుకోలేక చెయ్యడం, అంతే. వడుగు చేస్తున్నాం. ఎంతమంది జంధ్యం వేసుకుంటున్నారు? పెళ్ళిలో స్నాతకానికి, ఆ తరువాత కన్యాదానానికో, కర్మకో నిజానికి సవ్యం ఎటో, అపసవ్యం ఎటో ఎంతమందికి తెలుసంటారు?" గొప్ప దెబ్బ కొట్టేననుకున్నాను.

అతను నాలాంటి వాళ్ళని చాలామందిని చూసేడు. ఏమాత్రం తొణకలేదు.

అతను చప్పన శాస్త్రాలూ చప్పరించేసేడుట.

పురాణాలన్నీ ఆపోశన పట్టేసేడుట.

వేదాలన్నీ వెనుకనుంచి అప్పచెప్తాడుట.

అలాటివాడితోనా నా వేషాలు!

ఆనందరావుకి కర్మ శాస్త్రోక్తంగా చెయ్యకపోతే అతని ఆత్మ ఇటు భూమ్మీద లేక, అటు పరలోకానికి పోక మధ్యలో వేలాడుతుందిట.

"మరింకేం. జన్మరాహిత్యం అన్నమాట" అన్నాడు అపభ్రంశంవాడెవడో డైనింగు టేబిలు దగ్గర నుంచి.

నేను అంటించిన నిప్పులో అతను ఆజ్యం పోసేడు.

ఆ ముసలాయన సర్రున లేచి భుజం మీది గావంచా దులుపుకుంటూ, "దాన్ని జన్మరాహిత్యం అనరు. పుట్టగతుల్లేకపోవడం అంటారు. పూర్వం పుత్రుడు అంటే పున్నామ నరకం నుంచి తప్పించే వాడు అని అర్థం చెప్పుకునేవారు. ఇప్పుడు పుత్రుడు అంటే ప్రత్యక్ష నరకం సృష్టించేవాడు అని చెప్పుకోవాలి. పిదపకాలం, పిదప బుద్ధులూను" అని లోపలికి వెళ్ళిపోయేడు.

ఇంక నాకక్కడ ఉండాలనిపించలేదు.

"ఏంవిటో ఆయన చాదస్తం. మార్చురీలో పడేస్తే పోయేదానికి ఇంట్లో తెచ్చిపెట్టేరు. పిల్లలున్న ఇల్లు. నిన్న రాత్రంతా నిద్ర లేదు. ఇవేళా జాగరం చెయ్యాలి. ఆ మహానుభావుడేమో రేపటిగ్గాని రాడు. అన్నీ మాకే చుట్టుకున్నాయి. వీళ్ళ సెంటిమెంట్లు కాదు గాని తినేస్తున్నారు." పక్కగదిలో చిన్నకోడలు సణుక్కుంటోంది.

ఈవిడ మొగుడి కోసం ఆనందరావు ఎన్నిరాత్రులు నిద్రలేకుండా గడిపేడో!

ఒక్క రెండు రాత్రులు అతని కోసం నిద్ర మానుకోవడానికి ఇంత గిలగిల్లాడుతున్నారు.

వరండాలోనే ఆపేశాడు ఆనందరావు, "ఏంవిటి పరిస్థితి" అంటూ.

ఏంవని చెప్పను? నీ కోడలు నీ వల్ల నిద్రలేదని ఏడుస్తోందని చెప్పనా? నీ కూతురు యు.కెలో సీటు పోతుందని ఏడుస్తోందని చెప్పనా? నీకోసం ఏడవకపోయినా ఫరవాలేదు. ఆనందరావు ఏడవకుండా ఉంటే చాలు.

అంచేత చెకుముకి దహనం గురించి చెప్పేను.

అంతా విని అలా నిలువు గుడ్లేసుకొని చూస్తూ కూర్చున్నాడు.

మరోసారి చచ్చిపోయేడా ఏఁవిటి?

నాకు బాధ, ఉడుకుమోత్తనం వచ్చేసి, "అసలీ యజ్ఞం ఎవడు చెయ్యమన్నాడ్రా నిన్ను? నాకు తెలిసి నువ్వెప్పుడూ గుడిక్కూడా వెళ్ళలేదు." కసిరేను.

"బాబోయ్! నేను యజ్ఞం చెయ్యడవేఁవిట్రా? నాకు ఐదో ఏటో ఏమో మా తాత చేస్తే సరదాకి పక్కన కూర్చున్నాను. ఓ సమిధ విసిరేనేమో! కేవలం గొప్ప కోసం చెప్పేవాణ్ణి నేను యజ్ఞం చేసేనని. అంతే" అని తలపట్టుక్కూర్చున్నాడు.

"మంచి పనైంది. అనుభవించు. ఆ గొప్పే ఇప్పుడు శాపమైంది. ఇంక నిన్నా బ్రహ్మదేవుడు కూడా రక్షించలేడు" చిరాకు పడ్డాను.

వెంటనే నామీద నాకే అసహ్యం వేసింది.

చచ్చిపోయిన వాడిమీద విసుక్కోవడఁవా?

అదిగో అప్పుడే ఓ పోలీసు వచ్చి సంపంగి అత్తరు ఇచ్చేడు.

వెంటనే ఆ సీసా మొత్తం ఆనందరావు శరీరం (శవం అనడానికి మనసొప్పదు) మీద జల్లేసేను.

గుప్పుమంది సంపంగి వాసన.

ఆనందరావు మొహం ఆనందంతో వెలిగింది.

"థాంక్ యూ" అంటూ అరమోడ్పు కళ్ళతో ఏదో లోకంలోకి వెళ్ళిపోయేడు.

అదే నాక్కావల్సింది.

ఇంక ఈ ఐస్ చల్లదనం, ఈ పువ్వుల దండలు, పురుగులు ఇవేవీ అతన్ని బాధపెట్టవు.

ఆనందరావుకీ, సంపంగి అత్తరుకీ అవినాభావ సంబంధం ఉంది.

అల్లప్పుడెప్పుడో - దగ్గర దగ్గర నలభై ఏళ్ళ క్రితం - మేము పూనాలో చదువుకున్నాం. హోస్టలు దగ్గరే ఓ షాపుండేది. కుర్రాళ్ళమంతా సబ్బులు వగైరాలన్నీ అక్కడే కొనేవాళ్ళం. ఏఁవీ తోచకపోతే అందరం ఆ షాపు ముందే బాతాఖానీ చేసేవాళ్ళం. ఇందులో ఏం వింత లేదు.

వింతేఁవిటంటే - ఆ షాపు కౌంటర్లో ఓ అమ్మాయి కూర్చునేది.

ఆ అమ్మాయిని వర్ణించడానికి నాకొచ్చిన భాష చాలదు.

మనిషి సంపంగి మొగ్గలా - సోగ్గా ఉండేది.

రంగు సంపంగిపువ్వు రంగు.

ఆ అమ్మాయి నవ్వితే - ఎప్పుడూ పెదిమలు విడీ విడనట్లు సన్నగా నవ్వేది - సంపంగి మొగ్గ అప్పుడే నెమ్మదిగా విచ్చుకుంటున్నట్లు ఉండేది.

సంపంగి అత్తరు రాసుకునేదేమో గాని ఎప్పుడూ సంపంగి వాసన వచ్చేది.

ఆ అమ్మాయి పేరేఁవిటో ఎవరికీ తెలీదు.

అంచేత మా కుర్రాళ్ళందరూ ఎవరికిష్టమైన పేరు వాళ్ళు పెట్టుకున్నారు. ఆనందరావు "సంపంగి" అని పెట్టుకున్నాడు. అందరితోనూ ఇంగ్లీషులోనే మాట్లాడేది. అంచేత ఏ ప్రాంతం మనిషో తెలీదు.

అయితే, ప్రేమకి భాష అక్కర్లేదు.

మా హోస్టలు కుర్రాళ్ళంతా ఆ అమ్మాయిని యథాశక్తి ప్రేమించేరు.

అయితే, ఆనందరావు ఆరాధించేడు.

అభిమానించేడు.

ఆ అమ్మాయితో ఎప్పుడూ "నిన్ను ప్రేమిస్తున్నా"నని కాని, పెళ్ళిచేసుకుందాఁవని గాని చెప్పలేదు.

మా చదువులైపోయి వెళ్ళిపోయేం. అప్పుడు ఆనందరావేం మాట్లాడలేదు.

ఆ తరవాత కూడా భగ్నప్రేమికుడిలా విరహ గీతాలూ, విస్కీ సీసాలూ ఏం లేవు. జీవితంలో సెటిలై పెళ్ళి చేసుకున్నాడు.

అయితే, ఆ అమ్మాయిని మరిచిపోయేడేమోనన్న నా అభిప్రాయం తప్పని తరవాత తెలిసింది.

సొంత ఇంట్లో సంపెంగ మొక్క వేసేడు.

అది పెరిగి పెద్దదై విరగబూసేది. ఆ చెట్టుకింద రోజూ కొంతసేపు కూర్చుని ఏవో లోకాల్లోకి వెళ్ళిపోయేవాడు.

ఎప్పుడూ సంపంగి అత్తరు వాడేవాడు.

అప్పుడర్థమైంది, నాకు - ఆ అమ్మాయి ఆనందరావు గుండెలో చిరంజీవి అని.

అప్పుడే అర్థమైంది కూడా అసలైన ప్రేమంటే ఏఁవిటో.

బహుశా ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకుంటే అతనికి ఇంత ఆనందం శాశ్వతంగా దక్కేది కాదేమో!

ఇప్పుడు నేను అత్తరు చల్లగానే ఆనందరావు తన మధురానుభూతుల్లోకి వెళ్ళిపోయేడు. ఇంక తెల్లారేవరకు బాధ ఉండదు.

అతన్నా ఆలోచనల్లో వదిలి నేను ఇంటికి వెళ్ళిపోయేను. వెళ్ళేనే కాని మనసు పీకుతూనే ఉంది. ఈ చెకుముకి గండం గడిచేదెలా? చెకుముకిరాళ్ళకేం కర్మ. పోలీసుల్తో చెప్తే కొండలు తెచ్చి పడేస్తారు. కాకపోతే రెండు రోజుల నుంచి వర్షం వల్ల నానిపోయిన రాళ్ళెలా రాజుకుంటాయి?

రెండు కొండలు వెయ్యి మైళ్ళ స్పీడుతో గుద్దుకుంటే ఓ నిప్పురవ్వ రాలవచ్చు.

కళ్ళు మూస్తే ఆనందరావు ఏడుపు మొహం కనిపించి, కళ్ళు మూత పడలేదు.

తెల్లారగానే పరిగెత్తేను వాళ్ళింటికి.

పెద్దకొడుకు వచ్చినట్లున్నాడు తంతు మొదలుపెడుతున్నారు. ఆనందరావుకి స్నానం చేయిస్తున్నారు.

వీళ్ళమ్మ కడుపు కాలా రెండు రోజుల్నుంచి ఐస్‌లో నానుతున్నవాడికి స్నానం ఏఁవిటి?

దిక్కుమాలిన ఆచారాలు.

ప్రాణం లేని కర్రకి మడి, మైల ఏఁవిటి?

చెట్లు చచ్చిపోతే కర్రని తడిపి పొయ్యిలో పెడుతున్నాఁవా? అదీ ప్రాణఁవే కదా.

కోడిని చంపేక దానికి నీళ్ళుపోసి వండుకుంటున్నారా? దానిదీ ప్రాణఁవే కదా.

ప్రాణం ఉన్న ప్రతిచోటా ఆత్మ ఉంటే, పాపం జంతువుల ఆత్మలు క్షోభించవా?

ఈ ఆత్మల మీమాంసని వాయిదా వేసి, ఆ రాళ్ళ వ్యవహారం చూడ్డానికి లోపలికి పరిగెత్తేను. అందరూ హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు. ఒక్క చిన్న కూతురు మాత్రం కళ్ళొత్తుకుంటూ

సామాను సర్దుకుంటోంది. ఆవిడ ఫ్లైట్ మధ్యాహ్నం మూడు గంటలకిట.

అప్పటికింకా తండ్రి చితి మండుతూనే ఉంటుంది.

ఈ అమ్మాయి ప్లేన్‌లోంచే తండ్రి చితికి 'బై' చెప్తుందా?

భూమ్మీద శుక్ర నక్షత్రంలా వెలుగుతున్నాడనుకుంటుందా!

ఏమో!

గదిలో ఓ మూల సంచి నిండా ఉన్నాయి చెకుముకిరాళ్ళు. మొత్తానికి పోలీసులు అసాధ్యులే. అందులోంచి రెండు పెద్దవి తీసేను. స్టౌ మీద పెనం వేసి వాటిని బాగా వేడిచేసి ఓ రుమాలుతో చుట్టి పట్టుకున్నాను.

బాపులేని నవల గబగబ చదవకుండానే పేజీలు తిప్పేస్తాం. అలాగే మంత్రాలు కూడా పేజీలు తిప్పేయమని ముందుగానే ఆ కర్మ చేసేవాడితో చెప్పేను. చెప్పడఁవే కాకుండా ఓ వందరూపాయలు వాడి చేతిలో పెట్టేను.

ప్రపంచంలో డబ్బుకున్న పవర్ అటువంటిది.

తంతు వేగంగా అయిపోయింది.

ఆఖరుగా నోట్లో బియ్యం పొయ్యడం. కాళ్ళకి నమస్కారాలు వగైరాలు అవుతున్నాయి.

పెద్ద కొడుకుని తలకి కొరివి పెట్టమన్నారుకానీ, నిప్పు ఎవరైనా చెయ్యవచ్చు.

అంచేత నిప్పు చెయ్యడం కార్యక్రమం నేను తీసుకున్నాను. ఒక చిన్న మట్టి మూకుడులో పిడకలు, కొబ్బరిపీచు వగైరాలు పెట్టించేను.

నమస్కారం పెట్టేసినవాళ్ళంతా నా దగ్గర చేరేరు – నేను నిప్పు ఎలా చేస్తానో చూడాలని.

ఆనందరావు, నేను దొంగతనంగా సిగరెట్లు కాల్చేవయసులో జేబులో అయితే అగ్గిపెట్టె, సిగరెట్లు బయటికి కనిపిస్తాయని, షర్టు ఫుల్ హేండ్స్‌ని సగం వరకు మడిచి, ఆ మడతలో రెండు సిగరెట్లు, అరడజను అగ్గిపుల్లలు పెట్టుకునేవాళ్ళం – కొందరు ఆ మడతల్లో లవ్ లెటర్లు దాచేవారు.

ఎక్కడ పడితే అక్కడ రాతిమీద గాని, నేలమీద గాని అగ్గిపుల్ల గీసి అంటించడం ప్రాక్టీసు చేసేం. ఆనందరావుకి మాత్రం ఒకటి

రెండుసార్లు మిస్ అయేది.

నేను మాత్రం ఒకే ఒక్క స్ట్రోక్‌కి అంటించేవాణ్ణి.

ఆ విద్య ఈనాడు ఇలా ఉపయోగపడుతుందని ఎలా ఊహిస్తాను? చుట్టూ జనం ఉన్నారు. పైగా నావైపే చూస్తున్నారు. టెన్షన్.

నేను ఎడమ చేత్తో ఒకరాయి పట్టుకున్నాను. కుడిచేత్తో ఒకరాయి, దాని కింద గారడీవాడిలా ఎవరికీ కనపడకుండా రెండు అగ్గిపుల్లలు పట్టుకున్నాను.

నా గుండెలో చితి మండుతోంది.

ఆనందరావు చితికి నేను నిప్పు చెయ్యడమా?

ఇది సంభవమేనా?

చేతులు వణుకుతున్నాయి.

ఒక్కసారి తలెత్తి చూసేను.

అందరితో పాటు ఆనందరావు కూడా నా మీదికి వంగి చూస్తున్నాడు.

ఇప్పుడతని మొహంలో ఏడుపు లేదు.

నవ్వుతూ, "ఇదే ఆఖరి చూపు కదా" అన్నాడు.

నా గుండెలో మండుతున్న చితికి భూగోళం బద్దలైంది.

ఆకాశం ఆవిరైపోయింది.

ప్రకృతి స్తంభించిపోయింది. అంతే.

అగ్గిపుల్లలున్న రాతితో రెండో దాని మీద "ఠక్"మని కొట్టేను.

భగ్గున మంట వచ్చింది.

నాకంటినుంచి రాలిన కన్నీటి బొట్టు ఆ మంటని ఆర్పకుండా జాగ్రత్తపడి గిర్రున వెనక్కి తిరిగేను.

ఇంక నేను చెయ్యాల్సింది, చూడాల్సింది ఏం లేదు.

చెయ్యకూడనిది చేసేను.

కనీసం చూడకూడనిది చూడదల్చుకోలేదు.

"చెకుముకిరాళ్ళతో చితికి నిప్పెట్టడం థ్రిల్లింగ్‌గా ఉంది కదూ" అంటున్నారెవరో.

*("ఇండియాటుడే" నవంబరు 6-20, 1996)*